పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, ఏప్రిల్ 20: లోక సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. శనివారం కలెక్టరేట్‌లో సెక్టోరల్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ టీమ్స్‌కు పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, నిబంధనల పై దిశానిర్దేశం చేశారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, ఎసెన్షియల్ సర్వీసెస్ ఓటర్లు, కోవిడ్ బాధితులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. వీరు ఇంటి నుంచి ఓటు హక్కు పొందేందుకు ఫాం-12డి ద్వారా ఈ నెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 3 నుంచి 8వ తేదీలోగా వారి ఓటును నమోదు చేస్తామన్నారు. ఫాం-13ఏ, 13బి, 13సీ ల్లో పోస్టల్ బ్యాలెట్ పేపర్ సీరియల్ నంబరు, అటెస్టెడ్ సంతకంతో పాటు వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ప్రతీ ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ రోజు పోస్టల్ బ్యాలెట్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి రిపోర్టు ఇవ్వాలన్నారు. ఓటు వేసే ప్రక్రియను అత్యంత పకడ్బందీగా వీడియో రికార్డింగ్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అంతకు ముందు పోస్టల్ బ్యాలెట్ పై అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

WANTED
DEVELOPMENT OFFICERS
SBI LIFE INSURANCE
At Kazipet Branch
Salary
25,000/- + Incentives
Qualification
Any Degree (M/F)
Min: 1 Year Experience
H.No. 1-1-678, 1st Floor, Bala Teresa Complex, Siddhartha Nagar, Kazipet, Hanamkonda, T.G - 506003.
BM:9440313596

అన్నదాతను ముంచిన వాన



జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లులో నేలకొరిగిన వరి పంట

జనగామ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలు ప్రాంతాల్లో స్వల్ప నుంచి మోస్తరు వానలు కురిశాయి. బలమైన ఈదురుగాలులకు తోడు ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. పలు చోట్ల పిడుగులు పడ్డాయి. ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా జిల్లాలో ఆయా ప్రాంతాల్లో చేలల్లో వరి పంటలు నేలకొరిగాయి. నేడో, రేపో కోతకు వచ్చిన పంట ఈదురుగాలులతో నేలకొరగడంతో అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు గంటకు పైగా కురిసిన వానతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పిడుగుపాటు కారణంగా విద్యుత్ స్తంభాలపై ఇన్సులేటర్లు ధ్వంసం కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

తడిసిన ధాన్యం.. నేలకొరిగిన వరి

అకాల వర్షం కారణంగా జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. చాలా వరకు కొనుగోలు కేంద్రాలను లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో వర్షపు నీరు నిలిచింది. గత ఏడాది చాలా సెంటర్లలో వర్షపు నీరు నిలవడం వల్ల వడ్ల కుప్పలు మునిగిపోయాయి. కొన్నిచోట్ల కొట్టుకుపోయాయి. ఈ సారి కూడా లోతట్టు ప్రాంతాల్లో సెంటర్లను తెరవడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచింది. వడ్లకుప్పల కింది నుంచి నీరు ప్రవహించి ధాన్యం తడిసిపోయింది. ఇవ్వాలో, రేపో కాంటా అవుతుందనుకుంటున్న సమయంలో వర్షం పడి తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతున్నారు. కాగా.. ఈదురుగాలుల ప్రభావంతో పలు చోట్ల వరి పంట నేలకొరిగింది. పలు గ్రామాల్లో మామిడికాయలు రాలిపోయాయి.

విద్యుత్‌కు అంతరాయం..

జిల్లాలో వర్షం సమయంలో పలు చోట్ల పిడుగులు పడ్డాయి. జఫర్‌గడ్ మండలంలో ఎక్కువగా పిడుగులు పడ్డాయి. కూనూరు, ఉప్పుగల్లు, తిమ్మంపేట గ్రామాల్లో వర్షం ఎక్కువగా పడింది. కూనూరులో ఓ సెల్‌టవర్ జనరేటర్‌పై పిడుగు పడడంతో మంటలు లేచాయి. తిమ్మంపేటలో తాటిచెట్టుపై, ఉప్పుగల్లులో ఆకేరు వాగులో పిడుగులు పడ్డాయి. పిడుగుల కారణంగా 33కేవీ విద్యుత్ స్తంభాలపై ఉన్న ఇన్సులేటర్లు ధ్వంసం అయ్యాయి. ఉప్పుగల్లులో ఈదురుగాలులతో కరెంట్ తీగలపై చెట్టు కూలడంతో ఐదు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చిలుపూర్‌లో పిడుగుపాటుకు ఓ ఇంట్లోని ఫ్రిడ్జ్ ధ్వంసమైంది.



ఘన్‌పూర్ మండలం పాంనూర్ ఐకేపీ సెంటర్‌లో ధాన్యం కుప్పకిందికి వచ్చిన నీటిని తోడేస్తున్న రైతు

జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షం
ఈదురుగాలుల ధాటికి నేలకొరిగిన వరి
కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
పలుచోట్ల పిడుగుపాట్లు
జిల్లాలో సగటు వర్షపాతం 8.77మి.మీ.

నర్మెటలో 49.5 మి.మీ వర్షపాతం

జిల్లా వ్యాప్తంగా శనివారం 8.77మి.మీ. వర్షపాతం నమోదు కాగా జఫర్‌ఘడ్, స్టేషన్‌ఘన్‌పూర్, నర్మెట, తరిగొప్పుల మండలాల్లో వర్షం దంచికొట్టింది. జనగామ, బచ్చన్నపేట, దేవరుప్పుల, లింగాలఘణపురం, చిలుపూర్ మండలాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో స్వల్ప వర్షంతో మబ్బు పట్టింది. అత్యధికంగా నర్మెట మండలంలో 49.5 మి.మీ, జఫర్‌గడ్ మండ లం కూనూరులో 45 మి.మీ, స్టేషన్‌ఘన్‌పూర్ మండ లం తాటికొండలో 40.8 మి.మీ, తరిగొప్పులలో 27.8 మి.మీ, దేవరుప్పుల మండలం కోలుకొండలో 6.3 మి.మీ, లింగాలఘణపురంలో 4.8 మి.మీ, జఫర్‌గడ్‌లో 1.3 మి.మీ వర్షం కురిసింది.



కృష్ణాజీగూడెంలో పిడుగుపాటుకు మృతిచెందిన ఆవు



జఫర్‌గడ్ మండలం కూనూరులో పిడుగు పడి కాలుతున్న జనరేటర్



చిలుపూర్ మండలం కృష్ణాజీగూడెంలో తడిసిన ధాన్యం

ఓరుగల్లుపై బీజేపీ గురి

- మోదీ చరిష్మా... అరూరి ఇమేజ్‌పై కమల దళంలో ఆశలు
- 40ఏళ్లకు గెలుపుపై ధీమాతో కార్యక్షేత్రంలోకి శ్రేణులు
- ఇంటింటి ప్రచారం, కార్నర్ మీటింగులపై ఫోకస్
- అటు చేరికలు.. ఇటు పోల్‌మేనేజ్‌మెంట్‌పై నజర్





భూపాలపల్లి జిల్లా చిట్యాలలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న అరూరి రమేష్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి- వరంగల్)

వరంగల్ సీటుపై బీజేపీ కన్నేసింది. 40ఏళ్ల తర్వాత వరంగల్‌లో ఆ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నట్టు కమలనాథులు అంచనా వేస్తున్నారు. 1984లో చందుపట్ల జంగారెడ్డి బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించగా.. నాటిన ఉంచి మళ్లీ బీజేపీకి ఓరుగల్లు ఓటర్లు అవకాశం ఇవ్వలేదు. ఈసారి ప్రధాని నరేంద్రమోదీ చరిష్మాకు తోడు బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ఇమేజ్ తమ పార్టీ గెలుపునకు దోహదం చేస్తుందనే అంచనాల్లో నేతలున్నారు. దీంతో గెలుపు వ్యూహాలకు నేతలు మరింత పదను పడుతున్నారు. ఇంటింటి ప్రచారంతో ఓటర్లను వీలైనన్ని ఎక్కువసార్లు కలవటంతో పాటు కార్నర్ మీటింగులు, బూత్‌స్థాయి ప్రచారానికి ప్రాధాన్యమిచ్చేలా బీజేపీ అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. వలసలను ప్రోత్సాహిస్తూనే.. పోల్‌మేనేజ్‌మెంట్‌పై బీజేపీ ఫోకస్ చేస్తోంది.

బీజేపీలో 40ఏళ్లకు గెలుపుపై ఆశలు...

ఎప్పుడో 40 ఏళ్ల క్రితం గెలిచిన వరంగల్ స్థానంపై బీజేపీలో మళ్లీ ఆశలు చిగురించాయి. 1984లో వరంగల్ (హనుమకొండ) స్థానంలో టీడీపీ మద్దతుతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన చందుపట్ల జంగారెడ్డికి 2,63,762 ఓట్లు (51శాతం) పోలవ్వగా, అప్పటి కేంద్ర మంత్రిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి పీవీ.నర్సింహరావుకు 2,09,564 ఓట్లు (40.50శాతం) మాత్రమే పోలయ్యాయి. దీంతో

» మిగతా 8వ పేజీలో...

కొనుగోళ్ల నిలిపివేత

ట్రేడర్లు తక్కువ ధరకు కొంటున్నారని అధికారుల నిర్ణయం

జనగామ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. ట్రేడర్లు ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడంతో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 10న జనగామ మార్కెట్‌లో ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సైతం స్పందించారు. ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటే సహించేది లేదని, వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతుల ఆందోళన నేపథ్యంలో ముగ్గురు ట్రేడర్లపై అధికారులు కేసులు నమోదు చేశారు. దీంతో ట్రేడర్లు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయడంతో మార్కెట్‌కు వచ్చిన ధాన్యం పేరుకుపోయింది. ఓవైపు కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యాన్ని కొనొద్దంటూ ఏకంగా సీఎం ఆదేశించడంతో ట్రేడర్లు కూడా ముందుకు రాలేదు. ఈ క్రమంలో ధాన్యం పేరుకుపోవడంతో రైతులు నిరసన తెలిపారు. తాము ఎంతో కొంతకు ధాన్యాన్ని అమ్ముకుంటామంటూ రైతులు ఆందోళన చేయడంతో చేసేదేమీ లేక కొనుగోళ్లకు అధికారులు అనధికారికంగా అనుమతి ఇచ్చారు. దీంతో ఈనెల 16 నుంచి ట్రేడర్లు ధాన్యాన్ని కొన్నారు. రైతులు, ట్రేడర్ల మధ్య కుదిరిన ఒప్పందంతో క్వింటాకు రూ. 1700 నుంచి రూ. 2125 ధర చెల్లించారు. అయితే అప్పటికే ధాన్యం పేరుకుపోవడంతో కొత్తగా ఎవరూ తీసుకురావద్దంటూ అధికారులు మార్కెట్‌కు ఆదివారం వరకు సెలవులు ఇచ్చారు. సోమవారం నుంచి మార్కెట్ తెరవాల్సి ఉండడం, ట్రేడర్లు కనీస మద్దతు ధర ప్రకారం కొనకపోతుండడంతో మార్కెట్‌ను బంద్ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183 ధర చెల్లించాల్సిందేనని ప్రభుత్వం తేల్చి చెబుతోంది. ఈ క్రమంలో ట్రేడర్లు ఆ ధరకు కొనకపోతుండడంతో చేసేదేమీ లేక తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. రైతులు తమ తమ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచిస్తున్నారు. ఈ విషయంపై తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు మార్కెట్‌లో కొనుగోళ్లు జరగవని మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

మార్కెట్ తెరవాలని హమాలీల నిరసన

జనగామ మార్కెట్‌లో కొనుగోళ్ల నిలిపివేతపై హమాలీలు మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. కొనుగోళ్లను నిలిపివేయడం వల్ల 250 మంది హమాలీలు, స్వీపర్లకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. ఏడాదిలో నాలుగు నెలలు మాత్రమే తమకు ఉపాధి ఉంటుందని, సీజన్ సమయంలో మార్కెట్‌ను బంద్ చేయడం సరికాదని అన్నారు. కొనుగోళ్లను ప్రారంభించకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం యూనియన్ నాయకులు రాజు, అయిలయ్య, శ్రీనివాస్, రఘుపతి తదితరులు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు.

'చామల' గెలుపునకు కృషి చేయాలి

డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు గాను జనగామ మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం స్థానికంగా నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ప్రచార సరళిపై గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో ఓటర్లను కలుస్తూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలపై వివరించాలన్నారు. ప్రతీ బూత్‌లో కాంగ్రెస్‌కు మెజారిటీ ఓట్లు పడేలా పనిచేయాలన్నారు. సమావేశంలో అసెంబ్లీ కోఆర్డినేటర్ భవానీరెడ్డి, మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, నాయకులు అనిల్, బడికె ఇందిర, నిమ్మతి మహేందర్‌రెడ్డి, సర్వల నర్సింగరావు, శ్రీనివాస్‌రెడ్డి, వంగాల మల్లారెడ్డి, దూడల సిద్ధయ్య, మహేందర్, కాముని జయ తదితరులు పాల్గొన్నారు.


మద్యం, డబ్బు రవాణాపై దృష్టి పెట్టాలి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు దిలీబన్



అధికారులకు సూచనలు ఇస్తున్న దిలీబన్

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 20: ఓటర్లను ప్రభావితం చేసే డబ్బు, మద్యం తరలింపుపై అధికారులు దృష్టి సారించాలని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్ సూచించారు. శనివారం ఆయన ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించి ఎన్నికల విధులు నిర్వహించే వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్సైజ్‌శాఖ మద్యం నియంత్రణ పై దృష్టి సారించాలన్నారు. ప్రతీ రోజు స్టాక్ నిల్వల పై పూర్తిస్థాయిలో సమాచారం ఉండాలన్నారు. నిబంధనల మేరకే మద్యం విక్రయాలు జరిగేలా చూడాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా వాహనాలను తనిఖీ చేయాలన్నారు. అనుమతి లేని మద్యం గాని, రశీదు లేని డబ్బుగాని దొరికితే వెంటనే సీజ్ చేయాలన్నారు. రాజకీయ సమావేశాలు జరిగినట్లైతే వాటి ఖర్చుల వివరాలను నమోదు చేయాలన్నారు. మోడల్ కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున వీడియో సర్వేలెన్స్ టీమ్‌లు, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్, వీడియో లెన్స్‌టీమ్‌లు మరింత చురుగ్గా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ భీమ్‌శర్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐలు ముస్కు రాజు, శ్రీనివాస్‌యాదవ్, డీటీలు విజయ్‌కుమార్, రాజేష్‌రెడ్డి, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్, ఎస్సైలు నాగరాజు, వినయ్‌కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



Recognised by T.S. Govt.
SAI PUBLIC SCHOOL
A GREAT PLACE TO LEARN
PAVAN
Nursery to X Class
Venurao Colony, Pochamma Maidan, M.G. Road, Warangal - 506 002.
WE ARE HIRING
• PRINCIPAL • VICE-PRINCIPAL
OFFICE STAFF: P.R.O.s & Tele Callers • Receptionist • Accountant
TEACHING STAFF: • Pre-Primary Teachers • Primary Teachers for All Subjects • Teacher for Robotics & Coding • P.E.T. (Male & Female) • Teachers for Art & Craft Karate, Music & Dance
- English proficiency is a mandate
- Candidates with CBSE, State Board, experience are preferred
- Salary is negotiable for deserving Candidates
Date of Interview : 22nd April to 26th April, 2024
Send Your Resume to pavansaipublicschool@gmail.com
Cell : 6305438358, 9963042899

WANTED
WALK IN INTERVIEW
Inviting Applications for the following posts :
ADDITIONAL FACULTY FOR ACADEMIC YEAR 2024-25
IIT & Medical Foundation :
✦ Maths – 3 ✦ Physics – 3 ✦ Chemistry – 3 ✦ Biology – 2
High School Teachers :
✦ Telugu – 2 ✦ Hindi – 2 ✦ English – 2 ✦ Maths – 3
✦ Physical Science – 2 ✦ Social – 2
Non Teaching :
Wardens : Male – 10 ✦ Female – 5
Floor In-charges : Male – 2 ✦ Female – 1
P.E.T : Male – 1 ✦ Female – 1
Interview on : 22, 23, April 2024, Timings : 10:00 am to 5:00 pm
Venue :-
SHINE HIGH SCHOOL
(Residential Campus)
Erragattugutta, Near Kits College, Ambala Road, Hasanparthy, Hanamkonda.
Cell : 9866313315

కెనరా బ్యాంక్
కెనరా బ్యాంక్, చైతన్యపురి శాఖ, ఇ.నం. 1-1-904, సిద్ధార్థ నగర్, ఫాతిమా కాంప్లెక్స్ సమీపాన, హన్మకొండ, వరంగల్-506004

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) ప్రొవిజన్లతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

చైతన్యపురి శాఖ, అధీకృత అధికారిచే నిర్మాణాత్మక / వాస్తవిక స్వాధీనం చేసుకొనబడినట్టి, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా/చార్జ్ చేసిన దిగువ వివరించిన స్థిరాస్తి కెనరాబ్యాంక్, చైతన్యపురి శాఖకు ఉన్న బకాయి రూ. 88,50,967/- (రూపాయలు ఎనభై ఎనిమిది లక్షల యాభై వేల తొమ్మిది వందల అరవై ఏడు మాత్రమే) (25.05.2021 నాటికి కాంట్రాక్చువల్ బకాయిలు) రాబట్టు కొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలా", "ఉన్నది ఉన్నట్లు" మరియు "అక్కడ ఏది ఉంటే అదే" ప్రాతిపదికన 29.05.2024న విక్రయించబడునని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడుచున్నది.

రుణగ్రహీతలు మరియు హామీదారుల పేరు మరియు చిరునామా: మెసర్స్ శ్రీ మణికంఠ వాటర్ ప్లాంట్, ప్రొప్రయిటర్ శ్రీమతి అజిమీరా ధూలి భర్త అజిమీరా హరి సింగ్, ఇం.నం. 2-6-932, ఎఫ్ఐ/ఎన్ఆర్, హౌజింగ్ బోర్డ్ కాలనీ, కెఎల్ఎన్ రెడ్డి కాలనీ, హన్మకొండ, వరంగల్ అర్బన్-506001.
1. శ్రీ అజిమీరా హరి సింగ్, ఇం.నం. 2-6-932 ఎఫ్ఐ/ఎన్ఆర్, హౌజింగ్ బోర్డ్ కాలనీ, కెఎల్ఎన్ రెడ్డి కాలనీ, హన్మకొండ, వరంగల్ అర్బన్- 506001.
ఆస్తి పూర్తి వివరణ: శ్రీమతి అజిమీరా ధూలికి చెందిన జనగామ టౌన్, కల్లెం రోడ్ సమీపాన గల ప్లాట్ నం. 6-2-8/36/40, సర్వే నం. 282 వద్ద భూమి మరియు భవనం ఆస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: 50 అ.ల వెడల్పు రోడ్, దక్షిణం: విక్రయదారు ఖాళీ భూమి, తూర్పు: విక్రయదారు ఖాళీ భూమి, పశ్చిమం: వి. అంకుర్ రెడ్డి ఖాళీ స్థలం.

రిజర్వు ధర: రూ.67,86,000/- బయానా (EMD) : రూ.6,78,600/-

వేలం తేది & సమయం: 29.05.2024 ఉ. 11.00 గం.ల నుండి మ. 12.00 గం.లకు (అమ్మకం యొక్క నిర్ధారణ అయ్యేవరకు 5 నిమిషాల అపరిమిత విస్తరణలతో)
బయానా దాఖలుకు ఆఖరి తేది: 28.05.2024 సా. 05.00 గం.లకు.

బ్యాంక్‌కు తెలిసిన మేరకు తాకట్టు రుణభారాలు లేవు.
కెనరా బ్యాంక్ చైతన్య పురి శాఖ అధీకృత అధికారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా లేదా కెనరా బ్యాంక్ ఖాజీపేట శాఖ ఖాతా నం. 209272434, IFSC CODE: CNRB0003959 యొక్క ఖాతాకు RTGS/NEFT/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రిజర్వు ధర యొక్క 10% బయానా మొత్తం జమ చేయగలరు.

అమ్మకం యొక్క సవివర నియమ నిబంధనల కొరకు దయచేసి కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com)లో అందించిన "E-Auction" లింక్‌ను చదవగలరు. లేదా కెనరా బ్యాంక్ చైతన్యపురి శాఖ మేనేజర్ శ్రీ రవికుమార్, ఫోన్ నం. 8328621040ను ఏదేని పని దినమున కార్యాలయ వేళల్లో సంప్రదించగలరు.
తేది: 20.04.2024 సం/-
ప్రదేశం: హన్మకొండ అధీకృత అధికారి/కెనరా బ్యాంక్

డీజే నిర్వాహకుడిపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 20: పెళ్లి ఊరేగింపులో అర్ధరాత్రి డీజే సౌండ్స్‌తో ప్రజలను ఇబ్బందిపెడుతున్న డీజే నిర్వాహకుడితోపాటు పెళ్లివారిపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. హనుమకొండ పోచమ్మ కుంట ఫైన్ ఫంక్షన్ హాల్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి డీజేతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు డీజే ప్రాంతానికి చేరుకొని నిర్వాహకుడు తాటికొండ సాయి, పెళ్లి వారి నుంచి ముత్తోజ్ అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా సమ్మర్ స్పెషల్ రైళ్లు

కాజీపేట, ఏప్రిల్ 20 : రైళ్లలో వేసవి రద్దీ దృష్ట్యా పలు సమ్మర్ స్పెషల్ రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ - దానాపూర్ రైలు ఏప్రిల్ 28, మే 2, 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27 తేదీల్లో నడుస్తుంది. ఈ రైలు కాజీపేటలో నిర్ణయించిన తేదీల్లో ఉదయం 10 గంటలకు హాల్టింగ్ ఉంటుంది. దానాపూర్ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 21, 28, మే 5, 12, 19,28, జూన్ 2, 9, 16, 23, 30 తేదీలలో నడుపనున్నారు. ఈ రైలు నిర్ణయించిన తేదీల్లో కాజీపేటకు మధ్యాహ్నం 1 గంటలకు హాల్టింగ్ సౌకర్యం ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. ఇవే కాకుండా హైదరాబాద్ - రక్సెల్, హైదరాబాద్ - గోరఖ్ మధ్య సైతం సమ్మర్ స్పెషల్ రైళ్లను నడుపనున్నామని, వాటి షెడ్యూల్ త్వరలో విడుదల చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

24 నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

- ఉమ్మడి పది జిల్లాల నుంచి పాల్గొననున్న 50 జట్లు
- తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24నుంచి 27వరకు హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని హ్యాండ్ బాల్ కోర్టులో 6వ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. శనివారం హనుమకొండ జేఎన్ ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కార్యాలయంలో క్రీడా పోటీలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్‌కుమార్ పాల్గొని ముందుగా క్రీడా పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉమ్మడి పది జిల్లాల నుంచి హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీసి వారిని ప్రోత్సహించడానికి తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియే షన్ ఆధ్వర్యంలో 4రోజుల పాటు లీగ్ కమ్, నాకౌట్ పద్ధతిన పండుగ వాతావ రణంలో క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. అండర్-15బాలుర విభాగంలో నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 50 జట్లు పాల్గొంటాయని, ఇందులో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా మైదానం సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బసతో పాటు ఉచిత భోజన వసతులను కల్పిస్తామన్నారు. రాష్ట్ర స్థాయి టాలెంట్ హంట్ చాంపియన్‌షిప్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబ ర్చిన 100 మంది క్రీడాకారులను ఎంపిక చేసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలం గాణ (సాట్) సహకారంతో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యం లో హైదరాబాద్‌లో నెల పాటు ప్రత్యేక శిక్షణ అందిచడానికి కృషి చేస్తామ న్నారు. అత్యుత్తమ ప్రతిభతో రాణించిన క్రీడాకారులకు సాట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు కల్పించడంతోపాటు ఖేలో ఇండి యా హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొనేలా అవకాశాలను కల్పించాలన్నారు. విజేతలుగా నిలిచిన జట్టుకు ట్రోఫీ, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి ఇట్యాల శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

కావ్య గెలుపునకు సమష్టిగా కృషి చేద్దాం

- వరంగల్ లోక్‌సభ ఎన్నికపై మంత్రి శ్రీధర్‌బాబు దిశా, నిర్దేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 20 : వరంగల్ లోక్‌సభ స్థానాన్ని మూడు లక్షల ఓట్ల మెజారిటీతో కైవసం చేసుకోవాలని ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలకు మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. శనివారం రాత్రి హనుమకొండలోని ఓ హోటల్‌లో శ్రీధర్‌బాబు సమీక్ష జరిపారు. వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు అభ్యర్థి కడియం కావ్య ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ నాయకులు కూచన రవళి, ఈవీ శ్రీనివాస్, డాక్టరు అనిల్‌కుమార్, డాక్టరు రామక్రిష్ణ తదితరులతో సమీక్ష జరిగింది.

లోక్‌సభ ఎన్నికలో మెజారిటీ, గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గం వరకు ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల బాధ్యతల నిర్వహణ, మెజారిటీ, ప్రచారం, పార్టీ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్, 24న సీఎం రేవంత్‌రెడ్డి సభ, తదితర అంశాలను సుదీర్ఘంగా సమీక్షించారు. నిర్వహించాల్సిన అంశాలపై దిశా, నిర్దేశం చేశారు. పార్టీ గెలుపు ఖాయమని, అయితే మెజారిటీ అత్యంత ప్రాధాన్యత విషయమనేది గుర్తించాలని ఉద్బోధించారు. టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులతో చర్చించి నచ్చచెప్పాలని సూచించారు. 24 తరువాత ప్రచారాన్ని ఉధృతం చేయాలని, ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు బాధ్యతలు తీసుకోవాలన్నారు. పార్టీ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 24న మడికొండలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభ నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలను మంత్రి శ్రీధర్‌బాబు సమీక్షించారు. నియోజకవర్గాల వారిగా శ్రేణులతరలింపు, రవాణా ఇతర విషయాలను చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పాల్గొన్న ఎమ్మెల్యేలు తదితర ముఖ్య నేతలు

SUPER HIT నేడే చూడండి



వెంకటసాయి 70ఎంఎం ఏ/సి - కీసర 11.00,2.00,6.00,9.00
మహాలక్ష్మి - కొత్తపేట 11.15,6.15 కృష్ణ 70 - కాటేదాన్ 11.15,6.00
RAAMA FILMS 98490 10099

SUPER HIT నేడే చూడండి



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.00,6.00,9.00
అంజలి 70 ఎంఎం - సికింద్రాబాద్ 6.00,9.15
SRIMANI ENTERTAINMENTS 9849703118

RE-RELEASE BLOCKBUSTER
FAST FILLING ALL OVER LOWEST TICKET RATES



శాంతి 70 ఎంఎం - నారాయణగూడ
11.00,2.00,6.00,9.00
GLOBAL CINEMAS RELEASE

నేడే చూడండి HIT SUPER HIT



సప్తగిరి 70ఎంఎం - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
మహాలక్ష్మి 70ఎంఎం ఎ/సి - కొత్తపేట 2.30,9.45
SUCHIN CINEMAS THRO NTR CINEMAS 9030161717

BLOCKBUSTER RATINGS
FOR THE BLOCKBUSTER BOYS



సంధ్య 70 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.15,2.15,6.15,9.15
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
MYTHRI MOVIE DISTRIBUTORS LLP



విజయవంతమైన 4వ వారం



దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.15,2.30,6.00,9.15

విజయవంతమైన 2వ వారం



అర్జున్ 70ఎంఎం - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30
మెడా 70 - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

విజయవంతమైన 3వ వారం



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.00,9.30

వ్యయ పరిశీలన రిజిస్టర్ నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్‌సింఘా
- ఎన్నికల పరిశీలకులతో కమిషనర్ భేటీ



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తప్పకుండా ఎన్నికల వ్యయపరిశీలన రిజిస్టర్లు తప్పకుండా నిర్వహించుకోవాలని ఎన్నికల పరిశీలకుడు ధీరజ్‌సింఘా సూచించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో 15- వరంగల్ ఎస్సీ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్‌వో, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎన్నికల అధికారులతో శనివారం భేటీ అయ్యారు. ధీరజ్‌సింగా కార్యాలయంలోని పలు ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దీరజ్‌సింగా మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఖర్చులను రికార్డులను నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థుల అమోద, అమోదయోగ్యం కానీ ప్రతీ ఖర్చును లెక్కించాలన్నారు. అభ్యర్థుల ప్రచారం, ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధించిన అన్ని క్లిప్స్ సర్వేలెన్స్ టీములు రికార్డు చేయాలన్నారు. అభ్యర్థుల పూర్తి వివరాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందించాలని చెప్పారు. ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలని అన్నారు. పోటీచేసే అభ్యర్థులు అన్ని రకాల కర్చులు తప్పకుండా పక్కా లెక్క ఉండాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యయపరిశీలకులు మానస, అకౌంటింగ్ టీం సిబ్బంది భీరానాయక్, లింగస్వామిలతో పాటు పలు శాఖల సిబ్బంది ఉన్నారు.

ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి

- వరంగల్ తూర్పు స్వీప్ నోడల్ అధికారి రాజేశ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రాజేశ్‌కుమార్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ తూర్పు స్వీప్ నోడల్ అధికారి రాజేశ్ కుమార్ అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా శనివారం బల్దియా కార్యాలయం ఆవరణలోని మెప్మా కార్యాలయంలో ఓటు హక్కుపై లోక్‌సభ నియోజక వర్గం పరిధి -106 (వరంగల్ తూర్పు) స్వీప్ -2024 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏకశిల పట్టణ సమాఖ్య సభ్యులకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేశ్ కుమార్ హాజరై మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు అవగాహనపై ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావాలని అన్నారు. అదే విధంగా ఈ నెల 25న ఉదయం 8 గంటలకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ రమేష్, సీవోలు నాగరాజు, సఫియా, ఆర్‌పీలు పాల్గొన్నారు.

వరంగల్‌లో మూడో రోజు నాలుగు నామినేషన్లు



వరంగల్ పార్లమెంట్ ఆర్‌వో ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) అభ్యర్థి సావిత్రి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గాదెపాక అనిల్‌కుమార్



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతోంది. మూడో రోజైన శనివారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఎంసీపీఐ(యూ) అభ్యర్థి మాస్ సావిత్రి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి గాదెపాక అనిల్‌కుమార్ ఒకసెట్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్ ఒకసెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మరో స్వతంత్ర అభ్యర్థి బరిగెల శివ తొలిరోజున ఒక సెట్ వేయగా, శనివారం మరోసెట్ పత్రాలను అందజేశారు. ఇకమహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మూడో రోజు శనివారం

మహబూబాబాద్‌లో నిల్

ఒక్క నామినేషన్ కూడా దాఖలవలేదు. ఈ నెల 18న తొలి రోజు ఒకరు, 19న రెండవ రోజు నలుగురు నామినేషన్లు వేశారు. కాగా, 22వ తేదీ సోమవారం బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, 23న బీఆర్ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత నామినేషన్లు వేయనున్నారు.

నామినేషన్ కౌంటర్

మూడో రోజు (20-4-2024)

దాఖలైన మొత్తం నామినేషన్లు	
వరంగల్	మహ-బాద్
11	6

వరంగల్ (ఎస్సీ)	: మాస్ సావిత్రి (ఎంసీపీఐ), మేకల సుమన్ (ధర్మ సమాజ్ పార్టీ), గాదెపాక అనిల్‌కుమార్ (స్వతంత్ర), బరిగెల శివ (స్వతంత్ర)
మహబూబాబాద్(ఎస్టీ)	: లేవు.



సమాచారమంతా చరవాణిలోనే..

- సీ-విజిల్‌తో ఎన్నికల ఉల్లంఘనలకు అడ్డుకట్ట



వరంగల్ సిటీ, ఏప్రిల్ 20 : ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. గతంతో పోలిస్తే ఇప్పుడు డిజిటల్ అక్షరాస్యత పెరిగిపోయింది. ప్రతీ ఇంట్లో చరవాణి(మొబైల్), ప్రతీ మనిషికో చరవాణి మామూలైపోయింది. ఈ అంశాన్నే కేంద్ర ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకుంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పక్కాగా ప్లాన్ చేసింది. ప్రతీ విషయం ఓటరు తెలుసుకునేలా యాప్‌లను రూపొందించింది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఓటర్లు ఫిర్యాదు చేసేందుకు, ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు, అభ్యర్థుల వివరాలను తెలుసుకునేందుకు ఇలా ప్రతీ సమాచారం అందుబాటులో ఉంచుతోంది. బరిలో నిలిచే అభ్యర్థులు సైతం ఆన్‌లైన్ ద్వారానే సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు తీసుకునేలా అవకాశం కల్పించింది. భారత ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లను స్మార్ట్ ఫోన్‌లలో ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సీ-విజిల్‌తో..



అలాగే కోడ్ ఉల్లంఘన, వ్యయ ఉల్లంఘన జరిగితే వెంటనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడానికి సీ-విజిల్ యాప్‌ను ఉపయోగించండి. నగదు, మద్యం, మాదక ద్రవ్యాల పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టు వస్తువుల పంపిణీ, ప్రజల ఆస్తులను పాడుచేయడం, కుల, మత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు జరిగితే ఫిర్యాదు చేయవచ్చు. అలాగే అసత్య వార్తల ప్రసారం, ఓటర్లను బెదిరించడం, చెల్లింపు వార్తలు, మారణాయుధాలు కలిగియుండుట, ఓటర్ల రవాణా ఇలాంటివన్నీ ఎన్నికల నియమావళి ఉల్లంఘనల కిందకే వస్తాయి. వీటిపై సీ-విజిల్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. మీరు చేసిన ఫిర్యాదుకు వెంటనే ఎన్నికల అధికారులు స్పందిస్తారు. ఐదు నిమిషాల వ్యవధిలో జిల్లా ఎన్నికల అధికారి వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ యూనిట్‌కు ఫిర్యాదును కేటాయిస్తారు. 15 నిమిషాలలో ఫీల్డ్ టీమ్, ఫిర్యాదు చేసిన స్థలానికి చేరుకుంటుంది. 30 నిమిషాలలో ఫీల్డ్ టీం చర్య అమలు చేసి నివేదిక పంపిస్తారు. 50 నిమిషాలలో రిటర్నింగ్ అధికారి ఫిర్యాదుపై చర్యలు చేపడుతారు.

అదుపు తప్పి ఫ్లైయాష్ లోడ్ లారీ బోల్తా

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

మడికొండ, ఏప్రిల్ 20 : ఔటర్ రింగ్‌రోడ్డుపై ఫ్లైయాష్ లోడ్ లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మడికొండ ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున భూపాలపల్లి నుంచి సూర్యాపేటకు ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్న లారీ కాజీపేట మండలం టేకులగూడెం క్రాస్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ పై అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ గుగులోత్ నితిన్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. 100 డయల్ సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వారి సహాయంతో డ్రైవర్‌ను క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, లారీ డ్రైవర్, ఓనర్‌లు సూర్యాపేటకు చెందిన వారని ఏఎస్సై తెలిపారు.



వీవీ ప్యాట్, ఈవీఎంల తేడా



వరంగల్ కలెక్టరేట్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం), ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీ ప్యాట్). అభ్యర్థి పేరు, గుర్తు, సీరియల్ నెంబరు అన్ని కనిపిస్తాయి. ఇలా 7 సెకన్లు మాత్రమే ఉంటుంది. ఈవీఎంలలో కంట్రోల్ యూనిట్, బ్యాలెటింగ్ యూనిట్‌లు ఉంటాయి. కంట్రోల్ యూనిట్ పోలింగ్ ఆఫీసర్ దగ్గర, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ ఓటు వేసే ఓటరు దగ్గర ఉంటాయి. పోలింగ్ ఆఫీసర్ యాక్టివేట్ చేస్తేనే ఓటు వేసే అవకాశం ఉంటుంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్ష



వరంగల్ కలెక్టరేట్ : ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం ఎన్నికల నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించినట్లయితే రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. అభ్యర్థులు బాధ్యతాయుతంగా ఖాతాల వివరాలను ఎన్నికల అధికారులకు తెలియపర్చాలి. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు, పెయిడ్ న్యూస్, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను ఉల్లంఘనగా పరిగణిస్తారు.

వెబ్‌సైట్‌లో సమగ్ర సమాచారం



వరంగల్ కలెక్టరేట్ : ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించింది.

ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో ఓటరు నమోదుతో పాటు ఓటరు జాబితాలో పేరు, తొలగింపు, సవరణలు చేసుకోవచ్చు. అలాగే పోలింగ్ కేంద్రం వివరాలతో పాటు పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా గతంలో పోటీ చేసిన అభ్యర్థుల వివరాలు కూడా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

కష్టకాలంలో తోడున్న వారే నిజమైన కార్యకర్తలు

- ద్రోహులకు బీఆర్ఎస్ కార్యకర్తలు గుణపాఠం చెప్పాలి
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- పరకాలలో బీఆర్ఎస్ లోక్‌సభ స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బండా ప్రకాశ్

పరకాల, ఏప్రిల్ 20: కష్టకాలంలో తోడున్న వారే పార్టీకి నిజమైన కార్యకర్తలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని లలితా కన్వెన్షన్ హాలులో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. అధికార దాహం కోసం పార్టీ మారే నాయకులు, కార్యకర్తలు పార్టీకి అవసరం లేదని, ఎందరు వెళ్లినా వరంగల్ ఎంపీ స్థానం బీఆర్ఎస్ అధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో అబద్ధాల హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజు వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న రైతులకు రుణమాఫీ చేస్తామని ఇప్పటి కూడా కల్లబొల్లి మాటలు చెబుతున్నాడని అన్నారు. బ్రోకర్లే పార్టీలు మారుతున్నారు తప్పా.. నిజమైన కార్యకర్తలు పార్టీలోనే ఉన్నారని తెలిపారు. కడియం శ్రీహరిని తన తండ్రి చదివించాడని, అలాంటి వాడు తనను వ్యతిరేకించి మాట్లాడటం సరైంది కాదన్నారు. ఎన్నో కష్టాలకు ఓర్చి కాళేశ్వరం ప్రాజెక్టు కడితే రైతులు ఎంతో మంది మూడు పంటలు పండిస్తున్నారని, ఒకటి రెండు పిల్లర్లు కుంగితే కాంగ్రెస్ వాళ్లు వేలెత్తి చూపడం సరికాదన్నారు.

బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ అండతో ఎదిగిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్ ద్రోహులుగా నిలిచారని, ఎన్నికల్లో వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు మోసానికి, న్యాయానికి మధ్య జరిగే పోరు అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఎన్నో అబద్దాలు చెబుతూ ఎన్నో పదవులు పొంది, ఎంతో సంపాదించుకున్న కడియం శ్రీహరి మోసకారి అన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవిని రాజీనామా చేసి మళ్లీపోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ప్రతీ ఒక్క కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కడియం శ్రీహరి చేసిన ద్రోహం వివరించాలని పిలుపునిచ్చారు.

కడియం శ్రీహరి నకిలీ దళితుడు

కడియం శ్రీహరి నకిలీ దళితుడు అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. దళితద్రోహి, అవినీతి చక్రవర్తి, చరిత్రహీనుడు, దళిత హక్కులను దోచుకునేవ్యక్తి కడియం శ్రీహరి అని ధ్వజమెత్తారు. తాను మాదిగ కులానికి చెందినవాడినని, కడియం శ్రీహరికి దమ్ముంటే ఆయన కులం ఏమిటో చెప్పాలని నిలదీశారు. బైండ్ల కులంలో చేరి దళిత హక్కులను దోచుకుతింటున్నాడని ఆరోపించారు. కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీకి, దేవుడు లాంటి కేసీఆర్‌ను మోసం చేసి నకిలీ కులం పేరుతో బిడ్డను రాజకీయాల్లో దింపి గెలిపించుకునే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, తానూ పోటీ చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, లింగంపెల్లి కిషన్‌రావు, శోభన్‌బాబు, వాసుదేవరెడ్డి, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ ఉంటేనే దేశానికి భద్రత

- పథకాల పేరుతో కాంగ్రెస్ మోసం
- వరంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్



శాయంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న అరూరి రమేష్

శాయంపేట, ఏప్రిల్ 20 : నరేంద్ర మోదీ ప్రధానిగా ఉంటేనే భారత దేశానికి రక్షణ ఉంటుందని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డితో పాటు మండల కేంద్రంలో అరూరి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పదేళ్లుగా దేశంలో ఎలాంటి అవినీతి, కుంభకోణాలు లేకుండా బీజేపీ సుపరిపాలన కొనసాగిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించకపోయినా కేంద్రం పెద్దన్న పాత్ర పోషిస్తూ రాష్ట్రాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దులాంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలు జరిగాయని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అక్కడి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు సొంతంగా అనేక సేవా కార్యక్రమాలు చేశామని అన్నారు. వరంగల్ ఎంపీగా గెలిపిస్తే దేశంలోనే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, భూపాలపల్లి రైల్వేలైన్ నిర్మాణం, టెక్స్‌టైల్ పార్క్ విస్తరణ లాంటి అనేక లక్ష్యాలు పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ గెలిచిందని అరూరి ఆరోపించారు. ఇప్పటివరకు హామీలు అమలు చేయలేదని అన్నారు. లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించి. మోదీని ప్రధాని చేయడానికి బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగపురి రాజమౌళి, మార్తినేని ధర్మారావు, చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, వన్నాల శ్రీనివాసులు జిల్లా నాయకులు రాయరాకుల మొగిలి, నరహరిశెట్టి రామక్రిష్ణ, వనం దేవరాజు, నాగరాజు, కోమటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాలరాజు (ఫైల్)

ఐనవోలు, ఏప్రిల్ 20 : కుటుంబంలో కుమారుడు, తల్లి వరుసగా మృతిచెందడంతోపాటు తండ్రి, కూతురు అనారోగ్యానికి గురికావడంతో మనస్తాపానికి గురైన ఓవ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కొసుకొండ బాలరాజు (32) శుక్రవారం పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. బాలరాజు కుమారుడు సాయి మూడేళ్ల వయస్సులో కిందటేడు అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి సోమమ్మ రెండు మాసాల కిందట మృతి చెందింది. కూతురు వైష్ణవి మానసిక వికలాంగురాలు, తండ్రి మల్లయ్య పది రోజుల కిందట పక్షవాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులిద్దరు మృతిచెందడం.. ఇద్దరు అనారోగ్యానికి గురికావడంతో మనోవేదనకు గురైన బాలరాజు.. జీవితంపై విరక్తి చెంది ఐనవోలు శివారులోని జామాయిల్ తోటలో పురుగుల మందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఉంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి యూత్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 26నుంచి 28వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 1జనవరి 2006 నుంచి 31 డిసెంబరు 2007 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, మెడికల్ సర్టిఫికెట్‌లను వెంట తీసుకొని ఈ నెల 21న హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్‌హాల్‌లో ఉదయం 7గంటలకు రిపోర్టు చేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



WANTED
★ ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేయుటకు ఫీల్డ్ సర్వీస్ టెక్నీషియన్స్ కావలెను. (IFB ఇండస్ట్రీస్ Ltd., వరంగల్), అర్హత : 10th/ITI/12th Pass, ఆకర్షణీయమైన జీతం, కొత్త వారికి ట్రైనింగ్ ఇవ్వబడును. సంప్ర॥ 9000417040, 6305356582
AJW-188058

కావలెను
★ శ్రీ బాలాజీ మెడికల్ ఆఫీసు యందు పని చేయుటకు లేడి రిసెప్షనిస్ట్, డెలవరీ బాయ్ మరియు రిప్రజంటేటివ్స్ కావలెను. సంప్ర॥ 9133224565
AJW-5868

WANTED
★ హనుమకొండ చౌరస్తాలోని లక్ష్మిప్రియ లాడ్జిలో పని చేయుటకు మేనేజర్ కావలెను. వయస్సు : 50-60 సం॥లు ఉండవలెను. సం.ప్ర॥ సెల్ : 9399994560, 9963715050
AJW-188019

అర్జెంటుగా కావలెను
★ ప్రముఖ కాలేజ్ హాస్టల్లో పనిచేయుటం కొరకు అనుభవం కలిగిన వంట మాస్టర్ కావలెను. సంప్ర॥ 7386976303
AJW-188059

కావలెను
★ హాస్పిటల్‌లో పనిచేయుటకు ఫార్మసిస్ట్ మరియు సిస్టర్స్ కావలెను. సంప్ర॥ బీటీస్ లైఫ్ హాస్పిటల్, రోడ్ నెం. 1, బాలాజీ కాలనీ, హనుమకొండ. సెల్ : 9989510003
AJW-188022

వాచ్‌మెన్ కావలెను
★ గోపాల్‌పూర్, హనుమకొండ లోని అపార్ట్‌మెంట్‌కు భార్య భర్తలు వాచ్‌మెన్ కావలెను. రూమ్ వసతి కలదు. పూర్తి వివరాలకు సంప్ర॥ 9550107595
AJW-159683

WANTED TEACHERS
★ SRY CONCEPT SCHOOL, Kareemabad. (Nursery to 7th) to Teach all Subjects. Well Experience and English Fluence. Cont : 6304051160
AJW-5874

WANTED
★ అర్జెంటుగా ఆప్టికల్స్ షాపులో పనిచేయుటకు యువతి/యువకులు కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. ఆప్టికల్స్‌లో పనిచేసిన వారికి ప్రాధాన్యత. ఆకర్షణీయమైన జీతం. సంప్ర॥ 9030240970
AJW-188066

WANTED
★ శ్రీదేవి హాస్పిటల్‌లో పనిచేయుటకు లేడి ఫార్మసిస్ట్, OT బాయ్స్, ANM/GNM సిస్టర్స్ మరియు ఇంట్లో పనిచేయుటకు పని మనిషి కావలెను. సంప్ర॥ శ్రీదేవి హాస్పిటల్, కాకాజీ కాలనీ, M.S. రెడ్డి కాంప్లెక్స్ వెనుక, హనుమకొండ. సెల్ : 8185955888
AJW-3848

WANTED
★ Wanted Computer Operator, Quali : Computer Diploma, Computer and aplication, Copa I.T.I. & Electrician Instructor Quali : Diploma & DEEE, I.T.I, C.T.I Apprentice Pass, I.T.I Apprentice. Cont : Vignan Pvt. I.T.I. Cell : 9963131316
AJW-188026

EDUCATION
★ ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పి.జి 90 రోజుల్లో 100% పాస్ గ్యారంటీ ఫైన్‌తో అడ్మిషన్స్ కలవు. ఫైయిలై ఉంటే రికౌంటింగ్ ద్వారా పాస్ సౌకర్యం సంప్ర: 8019383310
AJH-002194

3+2 స్కీం కలదు

HOUSE FOR SALE
★ వడ్డెపల్లి పోలీస్ కాలనీలో 153 గజాల East Facing 2 BHK ఇల్లు 100% వాస్తు, కార్ పార్కింగ్‌తో అమ్మకానికి కలదు. ధర : 75 లక్షలు. సంప్ర॥ 9912394553, 7780505685
AJW-188020

KUDA PLOT FOR SALE
★ Oglapur Main Road అతి దగ్గరలో 100 ఫీట్ల రోడ్డు, 40 ఫీట్ల రోడ్ గల KUDA Plots కలవు. ధర 7,500/- నుండి 8,999/- వరకు. సంప్ర॥ సిరి - 6301613156
AJW-188021

PLOT FOR SALE
★ హసన్‌పర్తి సర్వే నెంబర్ 319లో గల 1 ఎకరం 26 గుంటల భూమి హసన్‌పర్తి - హుజురాబాద్ హైవే రోడ్‌కి అనుకొని ఉన్నది, సీతంపేట్ క్రాస్ రోడ్ వద్ద గల భూమి అమ్మబడును. సంప్ర॥ 9849848668
AJW-188061

ప్లాట్ అమ్మకానికి కలదు
★ హన్మకొండ జిల్లా, హసన్‌పర్తి మండలం, దేవన్నపేట శివారులో గల శుభనందిని Phase-II లో Layout Plot అమ్మకానికి కలదు. (రింగ్‌రోడ్ దగ్గరలో). సంప్ర॥ 9989418457, 7993085181
AJW-27530

PLOTS FOR SALE
★ ఆరేపల్లి ప్రతిమ హాస్పిటల్ & NSR కు దగ్గరలో NH 50 మీటర్ల దూరంలో 150 గ॥ నుండి 1000 గ॥ ప్లాట్లు మరియు కమర్షియల్ వ్యవసాయ భూములు అమ్మబడును. సంప్ర॥ 9281131001
AJW-3826

FLATS FOR SALE
★ New Flats 2BHK 930 Sft / 810 Sft. for Sale at 12 Cross near 2nd Lane Postal Colony, Opp : WGL Public School. Cell : 7780698038
AJW-177995

వ్యవసాయ భూమి అమ్మబడును
★ ముల్కలగూడెం గ్రామం ఐలోని మండలంలో 4.20 గుంటల వ్యవసాయ భూమి HNK బస్టాండ్ నుండి 20 కి.మీ. దూరం ఒక బావి, 2 బోర్లు గల భూమి అమ్మబడును. 1 ఎకరం 60 లక్షలు. సంప్ర॥ 8125663251
AJW-188025

PLOT FOR SALE
★ At Waddepalli Rd. Opp. Brundavan Apartment beside Park, approx 800 Sq. Yrds. Open Plot is for Long Lease Suitable for 2 & 4 Wheeler Show Rooms or any Business Gowdons. Cont : 9849234043
AJW-3602

HOUSE FOR SALE
★ WGL కొత్తవాడ లక్ష్మీగార్డెన్స్ దగ్గర 182 గజాల ఇల్లు గ్రౌండ్ ఫ్లోర్ 1BHK+ 2BHK, 1St ఫ్లోర్ 2BHK+ 2BHK 2nd ఫ్లోర్ 1BHK పార్కింగ్ గ్రౌండ్ ఫ్లోర్ 1-కార్ & 3బైక్స్, 1బోర్ WMC వాటర్ సంప్ర॥ 9704643450, 9652979107.
AJM-11632

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

PLOT FOR SALE
★ వరంగల్ స్తంభంపల్లిలో 150 చ॥గ॥లు, మరియు నాగేంద్రనగర్‌లో 98 చ॥గ॥లు ఇంటి నెం. 19-12-41/6 ఖాళీ స్థలము అమ్మబడును. సంప్ర॥ 9502208653, 9652432258 కొనేవారు మాత్రమే.
AJW-5858

PLOT FOR SALE
★ వడ్డేపల్లి filter bed లో 1100 Sq. Yrds Open Plot for sale Contact Cell : 9395320860, 9849033045, 7893490117
AJM-11610

PLOT FOR SALE
★ నాగేందర్ నగర్ రెవెన్యూ కాలనీలో (సుబేదారి) పూర్తి LRS కలిగిన 328 చ॥గ॥ నివాస స్థలం అమ్మబడును. సంప్ర॥ 9515991452, 9032557551
AJW-159737

PLOTS FOR SALE
★ GWMC & KUDA అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో అమ్మబడును. కేవలం 15,000/-లకు గజం మాత్రమే. సంప్ర॥ 9849992488
AJW-5875

HOUSE FOR SALE
★ మడికొండలో కేవలం 7 లక్షలకే 85 గజాలు గల ఇల్లు అమ్మబడును. సంప్ర॥ సూరిబాబు, సెల్ : 8008168824
AJW-188027

PLOT FOR SALE
★ 280 Sq.Yards Kuda Layout Compound Wall, H.No. South Facing 100 Ft. Road, Near Jemmi Trees Villas Shaympet, Hanamkonda. Cont : 7396791124
AJW-188027

FLAT FOR SALE
★ 2 BHK Flat, 1158 Sq. Ft. East Face, Ready to Occupy near Ideal School, Prakash Reddypet, HNK. Cont : 9949424539
AJW-188027

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

LEASE / RENT
★ Revenue Colony - II (Postal Cly.) లో 300 చ॥గ॥తో 8 రూములు గల ఇల్లు కిరాయికి ఇవ్వబడును. Suitable for Pvt. Office, School or Hostel. Cont : 9704643424, 9440200141
AJW-3603

LEASE / RENT
★ జులైవాడలో 1st Floor 2400 Sft. (5 Rooms + 3 Halls) కిరాయికి ఇవ్వబడును. Suitable for Offices, Hostels, etc., Cont : 9949726765
AJW-188024

SHUTTER FOR RENT / LEASE
★ 1500 Sq. Ft. షట్టర్ కమర్షియల్ స్పేస్ ఫర్ రెంట్ / లీజ్. Banks, ఆఫీసులు మంచి బిజినెస్‌లకు అనుకూలం. వడ్డెపల్లి రోడ్, టీచర్స్ కాలనీ రోడ్ 2 & 5 లలో జి.యం.ఆర్. అపార్ట్‌మెంట్స్ దగ్గర కలదు. సంప్ర॥ 7893960176
AJW-7063

TOLET FOR COMMERCIAL
★ 1050 Sft. each Floor (Ground, 1st & 3rd Floors) for Rent / Lease for Commercial / Corporate / Business Situated at Opp : Forest Office, Subedari, HNK. Cont : 9490594777
AJW-188055

శ్రీక్రిష్ణ ఆయుర్వేదిక్
★ శ్రీకృష్ణ ఆయుర్వేదిక్ క్లినిక్ & మెడికల్ స్టోర్స్ నందు అన్ని జబ్బులకు ట్రీట్‌మెంట్ ఇవ్వబడును, కన్సల్టేషన్ సమయం : ప్రతి రోజు సా॥ 5 గం॥ల నుండి 8:30 గం॥ వరకు & ప్రతి ఆదివారం ఉ॥ 10 గం॥ల నుండి 8:30 గం॥ల వరకు. సంప్ర॥ 8106820311, 9676729608
AJW-188065

HEALTH CARE
★ ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషెంట్స్ కొరకు అనువుగా 24 గం.ల సేవలు అందించబడును సంప్ర॥ 6281476205, 9440325526.
AJM-11631

FURNITURE FOR SALE
★ మంచి కండీషన్‌లో ఉన్న మెడికల్ షాపు ఫర్నీచర్ అమ్మబడును. సంప్రదించవల్సిన నెం. : 9849571995
AJW-5871

TATA ACE FOR SALE
★ మోడల్ - 05/2011, మంచి కండీషన్‌లో ఉన్న TATA ACE వ్యాన్ నెం. AP 29 V6049 గలది అమ్మబడును. సంప్ర॥ 9849848668
AJW-188061

VEHICLE FOR SALE
★ 132000 KM తిరిగిన బొలెరో 2018 BS IV గూడ్స్ - 1.5 టన్ పికప్ మంచి కండీషన్‌లో ఉన్నది అమ్మకానికి కలదు. సంప్ర॥ 9032111600
AJW-159770

సిద్ధి వినాయక వాటర్ ప్రూఫింగ్
★ మీ ఇల్లు కారుతుందా ! స్లాబ్ లీకేజ్, గోడ చెమ్మలు, గోడ క్రాకులు, స్లాబ్ పెచ్చులు ఊడిపోతున్న బాత్ రూమ్ లీకేజీలు బ్రాండెడ్ కెమికల్స్‌తో చెక్కిలేగా 10 సం॥ల గ్యారంటీతో వాటర్ ప్రూఫింగ్ చేయబడును. సంప్ర.7989775119
AJH-002359

SERVICES
★ కోర్టు కేసులతో బాధపడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? మీ కేసులు మీరే వాదించుకోండి. మీకు న్యాయ సలహాలు ఇస్తాము. అనగా భూతగాదాలు, DVC, Divorce Maintenance, 498-A, Child custody etc.. GLS, L.B.NAGAR, HYD : 7893011777
AJH-002362

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

అంబానీ కంటే నేనే గొప్ప!

అధికారుల ముఖాముఖిలో తేటతెల్లం చేసిన విద్యార్థులు

ఆలోచింపజేస్తున్న 'ప్రేరణ' విజేతల మనోగతం

లింగాలఘణపురం, ఏప్రిల్20: యువతను ప్రేరేపించేందుకు కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రేరణ ఉత్సవానికి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికై ప్రతిభ చాటారు. ఈనెల 13న వరంగల్‌లోని మామునూరు నవోదయ విద్యాలయంలో జరిగిన జాతీయస్థాయి ఎంపికపోటీలకు జిల్లాలోని 88 పాఠశాలల నుంచి 172 మంది విద్యార్థులు పాల్గొనగా ఫైనల్‌గా లింగాలఘణపురం మోడల్‌స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి బింగి సాయివరుణ్, కొడకండ్ల గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదోతరగతి విద్యార్థిని పాక మోక్షజ్ఞ ఎంపికై శభాష్ అనిపించుకుంటున్నారు. ప్రతీ జిల్లా నుంచి ప్రేరణకు ఎంపికైన విద్యార్థుల(ఒక బాలుడు.. ఒక బాలిక)కు వారం రోజుల పాటు గుజరాత్‌లోని మెహసానా జిల్లా వాదానగర్‌లో శిక్షణ ఇస్తారు. ప్రధానంగా మూడు అంశాలపై అధికారుల ముఖాముఖి మధ్య కొనసాగిన ప్రేరణ విజేతల ఎంపిక ప్రక్రియ నేనెవరు.., మన చరిత్ర, సాంస్కృతీ సంప్రదాయాలు, నా దేశం కోసం నేనేమి చేయాలి.. అనే ప్రధాన అంశాలపై ఇంటర్వ్యూ సాగింది. ఈ సందర్భంగా ప్రేరణకు జిల్లా నుంచి ఎంపికైన విజేత విద్యార్థుల మనోగతంపై ఆంధ్రజ్యోతి పలుకరించగా వారు అద్భుతమైన అనుభవాన్ని పంచుకున్నారు.. అవి వారి మాటల్లోనే..

అంబానీ కంటే నేనే గొప్ప..



బింగి సాయివరుణ్- మోడల్ స్కూల్, లింగాలఘణపురం

ప్రేరణ కార్యక్రమానికి పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఇద్దరం ఎంపికయ్యాం. అక్కడి నుంచి జిల్లా స్థాయి పోటీల్లో ముగ్గురు అధికారుల ముఖాముఖి ఇంటర్వ్యూలో నాపై ప్రశ్నలను సంధించారు. అంబానీ, నువ్వు(సాయివరుణ్)లో ఎవరు గొప్ప అని అడిగితే ప్రతీ నిత్యం ఆనందంగా ఉండే నేనే గొప్ప అని చెప్పేశాను. నీ చుట్టూరా పేరుకుపోయిన ప్లాస్టిక్ నిషేధం గురించి నువ్వేం చేస్తావని ప్రశ్నిస్తే.. నేను వీలైనంత వరకు క్రమంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ ఇతరులకు చూపిస్తాను. వాళ్లలో ఏ ఒక్కరు మారినా వారు ఇంకొకరిని మార్చే అవకాశం ఉంటుందని బదులిచ్చాను. వికసిత్ భారత్ గురించి నీ ఉద్దేశ్యం ఏంటని ప్రశ్నిస్తే.. గీతాంజలిలో రవీంద్రనాథ్ ఠాకూర్ పేర్కొనట్లుగా నా దేశ పౌరులు ప్రతీవారు తలెత్తుకుని నిర్భయంగా తిరిగి నా దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుతున్న దేశప్రధాని భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తానని, సుశిక్షితుడిగా నిజాయితీగా ఉంటానని చెప్పాను. ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాలో పేరు నమోదు నుంచి మొదలుకొని ఓటు వేసేదాకా నిజాయితీగా ఉండాలని నా తల్లిదండ్రులకు అర్థమయ్యేవిధంగా ఒకటికి రెండు సార్లు వివరిస్తానని చెప్పిన సమాధానాలకు ప్రధానంగా అధికారులు ప్రభావితమయ్యారు.

బంగారు లంక కంటే.. నా అయోధ్య గొప్పది..



పాక మోక్షజ్ఞ, గురుకుల పాఠశాల- కొడకండ్ల

నేను గ్రంథాలయంలో చదివిన పుస్తకాలకు సంబంధించిన అంశాలనే ప్రధానంగా ప్రశ్నించారు. నేను చదివిన మూడు ఇంగ్లీష్ పుస్తకాల పేర్లను వాటిలో ఉన్న సారాంశాన్ని వివరించాను. పాటలు పాడటం వచ్చని చెప్పడంతో హిందీ గీతాన్ని సురాగంతో ఆలపించాను. ఇదే పాటను పాడేందుకు తనకు నలభైవేల డాలర్లతోపాటుగా ఉచిత విమాన ప్రయాణం, వసతులు కల్పిస్తామని అమెరికా, కేవలం పదివేల రూపాయలు ఇస్తామని ఇండియా ఆహ్వానిస్తే నేను ఇండియాలోనే పాడుతానని బదులిచ్చాను. అదేవిధంగా బంగారు గోడలు గల లంకలో ఉండమని లంకేయులు కోరినా మట్టి గోడలున్న నా అయోధ్యే నాకు ఎంతో గొప్పదని రామాయణంలోని మాటలను ఉదహరించాను.

రూ.3లక్షలు జప్తు

మొండ్రాయి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న పోలీసులు

కొడకండ్ల ఏప్రిల్ 20 : రానున్న లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన మొండ్రాయి చెక్‌పోస్టు వద్ద పోలీసులు శనివారం రూ.3 లక్షలు జప్తు చేశారు. హైదరాబాద్ నివాసి రాకేష్‌కుమార్ తన వాహనంలో సూర్యాపేట జిల్లా తిర్మలగిరికి వెళ్తుండగా మొండ్రాయి వద్ద తనిఖీ చేయగా రు.3 లక్షలు లభించాయని పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. పట్టుకున్న నగదును త్రిసభ్య కమిటీకి సిఫారసు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో కొడకండ్ల ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



ఛాగల్‌లో నేలవాలిన మొక్కజొన్న చేనును చూపుతున్నరైతు శ్రీనివాస్



తాటికొండలో పిడుగుపడి మృతి చెందిన గేదెను చూపుతున్నరైతు కృష్ణమూర్తి



కొత్తపల్లిలో ఐకేపీ సెంటర్‌లో నీట మునిగిన ధాన్యం కుప్పలు



పాంనూర్‌లో నీట మునిగిన ధాన్యం చూపుతున్నరైతు గొడుగు సూరయ్య



నర్మెటలో అకాల వర్షానికి తడిసిన వడ్ల కుప్పలు

చేతికొచ్చిన పంట నీటిపాలు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 20: పంటచేతికి వచ్చే సమయంలో చెడగొట్టు వానతో అన్నదాతలు ఆగమయ్యారు. పాంనూర్, నెమలిగొండ ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దైంది. శివునిపల్లిలో గోనెల మహేశ్వరికి చెందిన వడ్ల కుప్ప నీట మునిగింది. కొత్తపల్లిలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం నీట మునిగింది. నెమలిగొండ శివారులో సముద్రాల వెంకటయ్య-భాగ్యలక్ష్మిలకు చెందిన ఐదు ట్రాక్టర్ల ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ఛాగల్ గ్రామంలో శ్రీనివాస్‌కు చెందిన మొక్కజొన్న నేలవాలింది. పాంనూర్, శివునిపల్లి, విశ్వనాథపురం, తాటికొండ, ఛాగల్, మీదికొండ గ్రామాల్లో వరి, మొక్కజొన్న నేలవాలాయి. తాటికొండలో మారపాక కృష్ణమూర్తికి చెందిన రెండు గేదెదూడలు పిడుగుపడి మృతి చెందాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

జఫర్‌గడ్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పలు చోట్ల పిడుగులు పడ్డాయి. తిమ్మంపేట, ఉప్పుగల్లు, కూనూరు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. తిమ్మంపేటలో ప్రధాన రహదారి పక్కనే ఓ ఇంటి ముందు ఉన్న తాటిచెట్టుపై, కూనూరులో వ్యవసాయ క్షేత్రంలో యాదనాల కొమురయ్యకు చెందిన వేపచెట్టుపై పిడుగు పడడంతో దగ్ధమయ్యాయి.. ఉప్పుగల్లు శివారు ఆకేరు వాగులో పలు చోట్ల పిడుగులు పడినట్లు స్థానికులు తెలిపారు. కూనూరు చివర ప్రధాన రహదారి పక్కన గల ఓ ప్రైవేట్ సంస్థ సెల్ టవర్ జనరేటర్‌పై పిడుగు పడి కాలిపోయింది. ఈదురు గాలులకు తోడు ఉరుములు, మెరుపుల నేపథ్యంలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉప్పుగల్లులో 33 కేవీ విద్యుత్ లైనుపై ఓ వృక్షం కూలడంతో ఐదు విద్యుత్ స్తంభాలు విరిగిపోయమాయ. 33 కేవీ విద్యుత్‌కు సంబంధించిన ఆరు ఇన్సులేటర్లు కాలిపోవడంతో కూనూరు, జఫర్‌గడ్ విద్యుత్ సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

నర్మెట: మండలంలోని అన్ని గ్రామాలలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కోనుగోలు కేంద్రాల్లో, కల్లాల్లో పోసిన ధాన్యం రాశులు తడిసి ముద్దాయ్యాయి. మామిడి తోటలు దెబ్బతిన్నాయి. మండలకేంద్రంతో పాటు బొమ్మకూరు, హన్మంతాపూర్, వెల్దండ, మచ్చుపహడ్, అమ్మాపూర్, మల్కపేట, గండిరామవరం గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో కోనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులు తడిసి ముద్దాయ్యాయి. వరి కోతకు సిద్ధంగా ఉన్న రైతులు భయాందోళన చెందుతున్నారు. వడగండ్లు కురవకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వడగండ్లు పడకముందే పంట చేతికి రావాలని రైతులు దేవుళ్లకు మొక్కుకుంటున్నారు.

చిలుపూర్: మండలంలోని పల్లగుట్ట, చిలుపూర్, మల్కాపూర్ తదితర గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టిన ధాన్యం సైతం తడిసి ముద్దవటంతో పాటు, కొంత ధాన్యం వరదల్లో కొట్టుకుపోయింది. కొన్నిచోట్ల చేతికందిన వరి నేలవాలింది. చిలుపూర్, కృష్ణాజీగూడెం గ్రామాల్లో బోళ్ళ రాజ్‌కుమార్ ఇంటిపై పిడుగు ప్రభావం చూపడంతో ఇంట్లో ఉన్న ఫ్రిడ్జ్, కూలర్లు ఇతర వస్తువులు ధ్వంసమయ్యాయి. ఊరడి పెద్ద యాదగిరికి చెందిన రూ 80 వేల విలువ గల పాడి ఆవు మృత్యువాతపడింది.

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కట్కూరు, బండనాగారం, వీఎస్‌ఆర్‌నగర్, లక్ష్మాపూర్, కేశిరెడ్డిపల్లి, బోనకొల్లూరు తదితర గ్రామాల్లో అరగంట పాటు వర్షం పడింది. ఉదయం నుండి మబ్బులు కమ్ముకుని ఉండటంతో రైతులు ధాన్యం తడవకుండా పలు చర్యలు చేపట్టారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోయకుండా తడిసిముద్దయిపోయాయి. సాల్వాపూర్ పాఠశాలలో బలమైన గాలి వీచటంతో చెట్టు విరిగిపడింది. వర్షం పడటంతో కోతలకు ఆటంకాలు కలుగుతున్నాయని రైతులు తెలిపారు.



ఉప్పుగల్లులో విద్యుత్ వైర్లపై కూలిన చెట్టు



బండనాగారం కొనుగోలు కేంద్రంలో నిలిచిన నీరు



శివునిపల్లిలో ధాన్యాన్ని ఆరబోస్తున్నరైతు మహేశ్వరి



నెమలిగొండలో తడిసిన ధాన్యం చూపుతున్న రైతు దంపతులు సముద్రాల వెంకటయ్య-భాగ్యలక్ష్మి

ఓరుగల్లుపై బీజేపీ గురి!

(5వ పేజీ తరువాయి)

పీవీ. నర్సింహరావుపై చందుపట్ల జంగారెడ్డి 54,198ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నాడు దేశంలో బీజేపీ గెలిచిన రెండు ఎంపీ సీట్లలో వరంగల్ ఒకటి. ఆ తరువాత జరిగిన ఏ ఎంపీ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధించలేదు. చలాసార్లు బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదు. 2014 ఎంపీ ఎన్నికల్లో రాగమళ్ల పరమేశ్వర్‌కు 1,87,139ఓట్లు (15.93శాతం), 2015లో జరిగిన ఉపఎన్నికల్లో పగిడిపాటి దేవయ్యకు 1,29,868 (12.57శాతం) ఓట్లు పోలయ్యాయి. 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చింత సాంభమూర్తికి కేవలం 83,777ఓట్లు (7.89శాతం) మాత్రమే పోలయ్యాయి. గత పదేళ్లలో ప్రతీ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు దిగజారుతూ వచ్చింది. అయితే ఈసారి అనూహ్యంగా బీజేపీ పుంజుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుండటం, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడి పోవటంతో కీలక నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. దీంతో మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దీటుగా ఎదిగేందుకు కాషాయ పార్టీ వ్యూహాలు రచించింది. ఈ క్రమంలోనే బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను బీజేపీలో చేర్చుకుని టికెట్ ఇచ్చింది. పార్టీలో కీలక నేతల మధ్య సమన్వయం చేసి ఎన్నికల బాధ్యతలను అప్పగించింది. 40ఏళ్ల తరువాత పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటంతో ఆ పరిస్థితులను వినియోగించుకోవాలన్న లెక్కల్లో బీజేపీ నేతలున్నారు.

మోదీ మేనియా.. అరూరి ఇమేజ్‌పైనే...

దేశవ్యాప్తంగా నరేంద్రమోదీకి ఉన్న చరిష్మాపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ ప్రాంతాలున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 42,783ఓట్లతో బీజేపీ అభ్యర్థి ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే వరంగల్ పశ్చిమలో 30,826 ఓట్లు, పరకాల అసెంబ్లీ సెగ్మెంట్‌లో 38,593ఓట్లను సాధించింది. అసెంబ్లీ ఎన్నికలకు, ఎంపీ ఎన్నికలకు ఓటరు నాడీ వేరేలా ఉంటుందని, ప్రస్తుతం మోదీ చరిష్మాతో అర్బన్ ప్రాంతాల్లో మెజారిటీ ఓట్లు సాధించవచ్చుననే లెక్కల్లో బీజేపీ శ్రేణులు ఉన్నాయి. అలాగే అరూరి రమేష్ వ్యక్తిగత పరిచయాలు, బలమైన బంధుత్వాలు ఉండటంతో వర్ధన్నపేట, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లో కూడా భారీ స్థాయిలో ఓట్లు పడుతాయనే అంచనాల్లో బీజేపీ నేతలున్నారు. పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌లో పార్టీ కొంత బలహీనంగా ఉందనే చర్చ జరుగుతోంది. అక్కడ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను తట్టుకుని కనీసం రెండోస్థానంలోకి రావాలనే వ్యూహంతో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ 'ఆపరేషన్ లోటస్'ను ప్రారంభించినట్లుగా సమాచారం. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో ఉన్న కీలక నేతలతో రహస్య మంతనాలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు బీజేపీ ఉమ్మడి వరంగల్ కీలక నేతలు ఐక్యతతో కలిసి పని చేస్తుండటం.. అధిష్ఠానం దూతలుగా మాజీ ఎంపీలు గరకపాటి మోహన్‌రావు, చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు పర్యవేక్షణలో కమలం పార్టీ స్పీడ్ పెంచిందనే చర్చ కేడర్‌లో వినిపిస్తోంది.

ఓటర్లే లక్ష్యంగా ముమ్మందుకు..

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఓటర్లే లక్ష్యంగా ఎత్తులు వేస్తోంది. మే 13న జరిగే ఎన్నికల లోపు ప్రతీ ఓటరును కలిసే వ్యూహరచన చేస్తోంది. బూత్ కమిటీ సభ్యులు ఎన్నికల నాటికి ప్రతీ ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లి ఓటరును కలిసి బీజేపీ అభ్యర్థికి ఓటడిగేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ నెల 15, 16, 17 తేదీల్లో తొలివిడతగా బూత్ స్థాయిలో ఇంటింటికి వెళ్లి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరిన శ్రేణులు.. రెండో విడతగా ఈనెల 28,29,30 తేదీలు, మూడో విడతగా మే 9,10,11 తేదీల్లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించేలా వ్యూహరచన చేస్తున్నారు. బూత్‌స్థాయి ప్రచారంతో పాటు కార్నర్ మీటింగ్‌లకు కూడా ప్రాధాన్యమిస్తున్నారు. మే మొదటి వారంలో సాధ్యమైనంత వరకు ఎక్కువగా బీజేపీ అభ్యర్థి రమేష్‌తో కలిసి కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేలా అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. పార్లమెంట్ పరిధిలో ఒకటిరెండు భారీ బహిరంగ సభలను నిర్వహించేలా అది కూడా ప్రధాని మోదీ లేదా అమిత్‌షాతో ఒక సభ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై లేదంటే జేపీ నడ్డాలలో ఒకరితో మరో మీటింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. గ్రామస్థాయి, వీధి మీటింగులతో పార్టీవాణిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారి వివరాలు సేకరించి, నిత్యం వారితో టచ్‌లో ఉండేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి చేరికలకు ప్రాధాన్యమిస్తున్నారు. పోల్‌మేనేజ్‌మెంట్‌లో ఎక్కడ కూడా వెనుకడుగు వేయకుండా వ్యూహాత్మకంగా కాషాయ పార్టీ కసరత్తు చేస్తోంది. మొత్తానికి ఓటరే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతుండగా.. 40ఏళ్ల తరువాత వరంగల్‌లో కాషాయ జెండా ఎగుతుందనే ఆశలో ఆ పార్టీ శ్రేణులున్నాయి.

గొడవ వద్దన్నందుకు..

తండ్రిపై కత్తితో దాడి చేసిన కొడుకు



గాయపడిన హరిచంద్రు

నర్మెట, ఏప్రిల్ 20: కోడలితో గొడవ పడుతుంటే ఆపేందుకు వెళ్లిన తండ్రిపై కొడుకు కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాన్సింగ్‌తండా కు చెందిన మాలోతు భిక్షపతి మద్యానికి బానిసై తన భార్య జ్యోతితో తరచూ గొడవపడి కొట్టేవాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడుతుండగా అది చూసిన భిక్షపతి తండ్రి హరిచంద్రు గొడవను ఆపేందుకు వెళ్లగా తండ్రిపై కత్తితో ఎడమ భుజంపై దాడి చేశాడు. పక్కనే ఉన్న మరో వ్యక్తి మోతిరాం ఆపడానికి వెళ్లగా అతనిపై కూడా దాడి చేశాడు. దీంతో గాయపడిన ఇద్దరని వెంటనే ఆసుపత్రికి తరలించారు. హరిచంద్రు ఫిర్యాదు మేరకు భిక్షపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

చిలుపూర్, ఏప్రిల్ 20: వంగాలపల్లి సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం తిమ్మాపూర్ గ్రామ పరిధిలోని అలీపూర్‌కు చెందిన కొండోజు మురళి (27) తన ఆటోలో ప్రయాణీకులను ఎక్కించుకుని స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్లాడు. తిరుగు పయనంలో హన్మకొండకు వెళ్తుండగా, అదేమార్గంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మురళి అక్కడికక్కడే చనిపోయాడు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చిలుపూర్ ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.

బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

బచ్చన్నపేట, ఏప్రిల్ 20: మండల కేంద్రంలో శనివారం బెల్టుషాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి రూ 22,300ల విలువ గల మద్యాన్ని సీజ్ చేశారు. బచ్చన్నపేటకు చెందిన నిందితుడు అందె సుధాకర్‌పై కేసు నమోదు చేశామని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు, స్థానిక పోలీసులు తెలిపారు.

పెద్ద శబ్దంతో బైక్ నడిపిన యువకుడిపై కేసు

జనగామ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పెద్ద శబ్దం వచ్చేలా బైక్ సైలెన్సర్‌ను మార్చి రాత్రి వేళల్లో అతివేగంగా బైక్ నడుపుతున్న ఓ యువకుడిపై జనగామ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని పోచమ్మ దేవాలయం ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ వ్యక్తి బుల్లెట్ బైక్‌పై పెద్ద శబ్దం చేస్తూ అతివేగంగా, అజాగ్రత్తగా బైక్ నడిపాడు. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఎస్సై సృజన్ గమనించి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతను తన బైక్ సైలెన్సర్‌ను మార్చడంతో పాటు నంబర్ ప్లేట్‌ను సైతం మార్పు చేశాడని, దీంతో అతడిపై కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారమే జిల్లా రవాణా శాఖ అధికారి జారీ చేసిన నంబర్ ప్లేట్లనే బిగించుకోవాలని, సైలెన్సర్‌లను సైతం మార్చిడి చేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

పల్లెల్లో కాంగ్రెస్ విస్తృత ప్రచారం

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 20: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు ఖాయమైపోయిందని, భారీ మెజార్టీ తీసుకువచ్చేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బెలిదె వెంకన్న అన్నారు. శనివారం నెమలిగొండ, పాంనూర్, శివునిపల్లి, విశ్వనాథపురం, తానేదార్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన బూత్ కమిటీల సమావేశాల్లో ఆయన బూత్ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు కడియం వెంటే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, మంతెన ఇంద్రసేనా రెడ్డి, రజాక్‌యాదవ్, బూర్ల లత-శంకర్, ఇనుగాల రజిత-రాజిరెడ్డి, కోతి రాములు, బత్తిని అశోక్‌గౌడ్, చిగురు విజయ్, కుందూరు శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, కొంతం శ్రీనివాస్, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, కాసాని బోందయ్య, పద్మారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్నరైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న

జఫర్‌గడ్: తమ్మడపల్లి(జి), సూరారం, షాపల్లి, హిమ్మత్‌నగర్, తిమ్మాపూర్, జఫర్‌గడ్ గ్రామాల్లో శనివారం కార్యకర్తలచే బూత్ కమిటీల ఎన్నిక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల అయిలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్‌లు అన్నెబోయిన భిక్షపతి, అన్నం బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశాల్లో సొసైటీ చైర్మన్ కరుణాకర్ రావు, మాజీ ఎంపీపీ కట్టా మనోజ్‌రెడ్డి, నేతలు సిహెచ్.కృష్ణమూర్తి, ఎడ్ల వెంకటస్వామి, కుల్ల మోహన్ రావు, ఇ.శ్రీనివాస్, డానియల్, విజయ్‌కుమార్, మర్రి రమేశ్, మామిడాల మధుబాబు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు కుర్చపల్లి, అయ్యవారిగూడెం, గోవర్ధనగిరి, కోమల్ల, కంచనపల్లి, శివాసీనగర్, రామన్నగూడెం గ్రామాలలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. మడికొండలో ఈ నెల 24న సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో లింగాల జగదీష్ చందర్ రెడ్డి, బొల్లం అజయ్‌మణికంఠ, కోళ్ల రవిగౌడ్, మారజోడు రాంబాబు, కంసాని మధుసూదన్ రెడ్డి, మేకల నరేందర్, నీలం యువరాజ్, పగిడిపల్లి కృష్ణ, రాజ్‌కుమార్, శివకుమార్, బుచ్చయ్య, పృథ్వి పాల్గొన్నారు.

చిలుపూర్: కడియం కావ్యకు భారీ మెజారిటీని అందించడమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు సురేశ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన కొండాపూర్, శ్రీపతిపల్లి, లింగంపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఎంపీగా కడియం కావ్య అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిడాల లింగారెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, భూక్య రమేష్‌నాయక్, తీగల మహేందర్, బొమ్మిశెట్టి బాలరాజు, కొయ్యడ రాందాస్, గొంగిడి కృష్ణమూర్తి, పాశం సురేశ్, గుగులోతు ఉమ్లానాయక్, ఏదునూరి రవిందర్, జంగిటి ప్రభాకర్, గాజుల రజిని, కండ్లకోలు బాలరాజు, గొడుగు కరుణాకర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయాలి

ఎంపీపీ, జడ్పీటీసీ సుదర్శన్, బేబీ శ్రీనివాస్

జఫర్‌గడ్‌లో మండల సర్వసభ్య సమావేశం

జఫర్‌గడ్, ఏప్రిల్ 20 : ప్రభుత్వం మండలానికి పంపిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని జఫర్‌గడ్ ఎంపీపీ రడపాక సుదర్శన్, జడ్పీటీసీ ఇల్లందుల బేబీ శ్రీనివాస్ అధికారులను కోరారు. జఫర్‌గడ్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో ఆయా అంశాలపై జరిగిన చర్చలో వారు పాల్గొని మాట్లాడుతూ మండలంలో 104 మందికి నెల రోజుల క్రితమే కల్యాణలక్ష్మీ చెక్కులు వచ్చాయని... ఎన్నికల నిబంధనల పేరుతో ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై తమకు సమాచారమే లేదంటూ అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ఉంటే ప్రజా ప్రతినిధులమైన తమకు కనీసం సమాచారం ఇవ్వకూడదా.. అంటూ ప్రశ్నించారు. గ్రామ పంచాయతీల్లో వీధి లైట్ల ఏర్పాటుకు ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించడం మూలంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. పలు గ్రామాల్లో వీధి లైట్లు సక్రమంగా వెలగడం లేదని, సదరు కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సుదర్శన్, బేబీ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుకన్య గ్రామ కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీవో సుమన్, తహసిల్దార్ అంబటి ఆంజనేయులు, పలు గ్రామాల ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జఫర్‌గడ్ మండల సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రడపాక సుదర్శన్

కూలీలకు పని కల్పించాలి



గోపాల్‌నగర్ పల్లె ప్రకృతి వనంలో వివరాలు అడుగుతున్న అదనపు కలెక్టర్

బచ్చన్నపేట, ఏప్రిల్ 20: మండల వ్యాప్తంగా 5 వేలకు పైగా కూలీలు పనిచేసేలా చూడాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం గోపాల్‌నగర్ గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. రిజిష్టర్‌లను, మస్టర్‌లను చెక్ చేశారు. కూలీలతో మాట్లాడారు. ఏప్రిల్ 1 నుంచి కూలి రూ. 300లు నిర్ణయించిందున దానికి అనుగునంగా పనులు చేయాలన్నారు. అనంతరం గోపాల్‌నగర్, బండనాగారం గ్రామాల్లో గ్రామ నర్సరీలు, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గతంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. టార్గెట్ మేరకు నర్సరీలో మొక్కలు పెంచాలన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాలన్నారు. ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో మొగులప్ప, అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్, డీపీఎల్‌వో పార్థసారధి, ఎంపీడీవో రఘురామకృష్ణ, ఏపీవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీసీపీ

బచ్చన్నపేట, ఏప్రిల్ 20: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో చెక్‌పోస్ట్ వద్ద బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది వాహనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన అనంతరమే పంపించాలని డీసీపీ సీతారాం సూచించారు. శనివారం మండలంలోని గోపాల్‌నగర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. డబ్బు, మద్యం, ప్రలోభాలకు గురిచేసే ఇతర వస్తువులు రవాణా చేసే అవకాశం ఉన్నందున పగలు, రాత్రి తనిఖీల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా విధుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ అంకిత్‌కుమార్, ఎస్‌ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచార రథం ప్రారంభం



లింగంపల్లిలో ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి

చిలుపూర్, ఏప్రిల్ 20 : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి గంకిడి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఆయన లింగంపల్లిలో ఎన్నికల ప్రచార వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన పదేళ్ళుగా దేశంలో ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్ళి వివరించాలని కార్యకర్తలను కోరారు. ఈ ఎన్నికల్లో అరూరి రమేష్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్, నాయకులు తోకల సంపత్‌రెడ్డి, తోట శ్రీనివాస్, బాల్నె శ్రీనివాస్, ఊరడి రాజు, సాదం రామరాజు, దోరం శ్రీనివాస్, సాదం భీమన్న, కాదుకాయ రమేష్, వెలిశాల శ్రీనివాస్, కందుకూరి రజనీకర్ తదితరులు పాల్గొన్నారు.

బూర నర్సయ్య గెలుపు కోసం ప్రచారం..

జనగామ కల్చరల్, ఏప్రిల్ 20: బీజేపీ భువనగిరి పార్లమెంటు అభ్యర్థి బూర నర్సయ్య గెలుపు కోసం శనివారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. జనగామ మునిసిపాలిటీ పరిధి 17, 18, 24, 27 వార్డులలో ప్రచారం నిర్వహించి దేశం కోసం, ధర్మం కోసం నరేంద్ర మోదీ పాలన చూసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా, సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, వారణాసి పవన్ శర్మ, ఐత శ్రీకాంత్, కూకట్ల ఉప్పలయ్య, పానుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

జిల్లా సహకార అధికారి రాజేందర్ రెడ్డి



పల్లగుట్ట కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న రాజేందర్ రెడ్డి

చిలుపూర్, ఏప్రిల్ 20 : రైతులు తడిసిన ధాన్యం విషయంలో ఆందోళన చెందొద్దని జిల్లా సహకార అధికారి (డీసీవో) రాజేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం ఆయన దేశాయితండా, పల్లగుట్ట, కృష్ణాజీగూడెం, ఫతేపూర్ తదితర గ్రామాలను సందర్శించి స్టేషన్‌ఘన్‌పూర్ - చిలుపూర్ మండలాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్, డీసీఎస్‌వో రోజారాణితో కలిసి అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఎలాంటి షరతులు లేకుండా తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. మరో మూడ్రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, సీఈవో మఖ్దూం అలీ పాల్గొన్నారు.

సుధీర్‌కుమార్ నామినేషన్‌కు తరలిరావాలి

బీఆర్‌ఎస్ పాలకుర్తి ఇన్‌చార్జి మెట్టు శ్రీనివాస్

పాలకుర్తి, ఏప్రిల్ 20: బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ నామినేషన్‌కు వేలాదిగా తరలి రావాలని పాలకుర్తి ఇన్‌చార్జి మెట్టు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం పాలకుర్తిలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22న ఉదయం 11గంటలకు హన్మకొండలోని వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో సురేష్‌కుమార్ నామినేషన్ వేస్తున్నట్టు వెల్లడించారు. మండలం నుంచి కార్యకర్తలు అధికసంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పసునూరి నవీన్, ఎంపీపీ నాగిరెడ్డి, నాయకులు పుస్కూరి శ్రీనివాస్, బొబ్బల అశోక్‌రెడ్డి, మాచర్ల ఎల్లయ్య, కడుదుల కర్ణాకర్, ఎడవెల్లి పురుషోత్తం, కృష్ణ, శ్రీను, మల్లేష్, రవివర్మ, కొండయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.